



చల్లనిగాలి. సాయంకాలపు నీరెండ, పార్క్ మ్యూజియంలో నుండి వినవచ్చే రికార్డుల సంగీతం, రంగురంగుల చీరలతో సీతాకోకచిలుకలవలె వయ్యారాలొలకబోస్తూ విహరించే అమ్మాయి గారలతో, వారికి పహారా ఇస్తూ (వెంటాడుతూ అంటే వాళ్ళు బాధ పడతారు), నైలాన్ షర్ట్లతో, సిగరెట్ల పొగలతో, నల్లబుష్కోట్లు, రంగుపాంట్లతో తిరిగే అబ్బాయి గారలతో, ఉబుసుపోక, ఆదివారం

పిరికితనం ఎరగనివాడు వీరుడు కాలేడు వేరొక విధంగా చెప్పాలంటే పిరికివాడే నిజమైన వీరుడు ఇవి అన్నిటా చెల్లుతుందేమో కాని ప్రేమ వ్యవహారాలలో విజయం సాధించాలనుకొంటే మాత్రం ప్రయోజనం శూన్యం.

---

సాయంకాలం ఎట్లా గడపాలా అని ఆలోచిస్తుండగా భాగ్యనగరి సాధింపు తట్టుకోలేక ఆమె తోడు రాగా, పెంపేసిన సువాస్తులతో కళకళల కారులలో (పుట్టుకతోనే కారులోనే పుట్టినట్టుగా) కుటుంబసమేతంగా అవతరించిన ఆఫీసరులతో కలకలలాడి పోతూంది పబ్లిక్ గార్డెన్సు — హైదరాబాదీయుల 'భాగయాం'

ఇంతటి హడావుడిని కారుల రొదను, రికార్డుల సంగీతపు హోరును లెక్కచెయ్యకుండా, అందరికీ దూరంగా జోడు చెట్ల పొదలకు దగ్గరగా కూర్చున్నారు భాస్కర్, రాధాదేవి, మూర్తి. చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నారు.

ఇప్పటి ఆహార సమస్య గురించే ఆలోచిస్తున్నారో, చేసుకోబోయే వివాహం గురించే ఆలోచిస్తున్నారో, లేక ప్రేమ విషయాలే ఆలోచిస్తున్నారో అంతుపట్టటం లేదు. కాని, వాళ్ల ముఖాలు మాత్రం ఏదో సమస్య పరిష్కారాన్ని చేస్తున్నట్టు వాడిపోయి ఉన్నాయి.

[ఈ కథా వస్తువు, ఇందలి పాత్రలు, సంఘటనలు కేవలం కల్పితాలు. ఎవరినీ ఉద్దేశించినవి కావు. అనవసరంగా బుజాలు తడుముకోవద్దని ప్రార్థన. ఈ కథ భాస్కర్ వంటి పిరికివాళ్ళందరికీ అంకితం.]

ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ భాస్కర్ ప్రారంభించాడు: "చూడు, రాధాదేవీ! ఉదయం నీవడిగిన ప్రశ్నకు సమాధానం కొరకు ఇంత చెప్పవలసి వచ్చింది. ఇక అసలు విషయానికి వస్తాను 'నిన్ను ప్రేమించాను, పెళ్లి చేసుకుంటాను' అని అంటున్నాను. కాని, ఎప్పుడు చేసుకుంటాను అన్నది తేల్చటం లేదు. అదే కదా నీ బాధ?"

"కాదు, భాస్కర్! నిరుడు దీపావళినాడు ప్రారంభం అయింది ఈ కథ. తిరిగి పదిహేను రోజులలో దీపావళి రానున్నది. మీరు నిశ్చింతగా, నిర్వికారంగా కాలాన్ని గడప గలుగుతున్నారు. కాని, నా హృదయంలోని ఆరాటం ఎప్పుడైనా తెలుసుకో డానికి ప్రయత్నించారా? నాలో ఎన్ని అగ్నిపర్వతాలు ప్రజ్వరిల్లుతున్నాయో చూచారా? అవి మీ కనవసరం. మీరు మగవారు. స్త్రీ హృదయంలోని బాధ మీకేం తెలుస్తుంది?" అంటూ భారం నిండిన ముఖాన్ని క్రిందకు దించుకుంది.

**జి. భానుమూర్తి**

ఊరికే కూర్చున్న మూర్తి ఈ వాతావరణంలో నీళ్ల నుండి బయటపడ్డ చేప పిల్లలా బాధపడుతున్నాడు.

తిరిగి భాస్కర్ ప్రారంభించాడు: "అదిగో, రాధాదేవీ! కన్నీళ్లు పెట్టవద్దని ఎన్నిసార్లు నీకు చెప్పాను?"

".... ...."

"నామాట విను. నీవంటే అనురాగం లేక పోలేదు. కాని, ఏం చెయ్యను? నిజాన్ని నీనుండి దాచి, ఈ వివాహాన్ని ఎలా చేసుకోమంటావ్? నా సంగతి నీకింతవరకూ పూర్తిగా తెలియదు. నా జీవిత విశేషాలు వింటే ఇలా ఎప్పుడూ అడగవు. నానుండి దూరంగా, నా నీడైనా పడని చోటికి నీ హృదయాన్ని పూర్తిగా కడిగివేసుకుని పారి పోతావ్ — పిలిచినా పలకకుండా."

"చూడండి, భాస్కర్! ఈ విధంగా ఈ సంవత్సరం పొడుగునా నాకెన్నో విషయాలు చెప్పారు. ఆశతో అన్నీ విన్నాను. నేను మిమ్మల్ని నమ్మాను. మీ కుటుంబ విషయాలు నా కనవసరం లేదు. నాకు కావలసిందల్లా మీ హృదయంలో కొంతచోటు; మీ ప్రేమ. ఇంతే. దీనికిమీరెందుకింత ఆలోచిస్తున్నారో నా కర్థంకావటం లేదు."

"అదే, రాధాదేవీ ఎవ్వరికీ అర్థం కాని విషయం— నా జీవితపు క్రాస్‌వర్డ్ పజిల్, నా మనోవ్యాధి సాతాడు. అందుకే నేనన్నోమార్లు ప్రయత్నించాను, నా జీవిత విశేషాలు తెలియచేయాలని. నాకు ఆ అవకాశం చిక్కలేదు. ఇప్పుడు ఆ అవకాశం వచ్చింది. ఇక చెప్పక తప్పదు. అందుకే మూర్తిని కూడా తీసుకు వచ్చాను. అతనే మనకు సాక్షి. నా ఈ ప్రేమ కలాపానికి ఇంత వరకూ తెర మరుగు పెర్సనేజ్."

మూర్తి ఆశ్చర్యంగా అతని కళ్లలోకి చూశాడు. భాస్కర్ కండ్లలోనే చిరునవ్వు నవ్వాడు. ఈ జటిల సమస్యను ఎలా ఎదుర్కోవాలో తెలియక బాధపడుతూంది అమాయకపు రాధ.

భాస్కర్ తిరిగి చెప్పటం మొదలు పెట్టాడు:

"క్రితం దీపావళినాడు రాత్రి నీవు కొత్త చీర సింగారించుకుని, తలంటుకున్న కురుల వాల్జడలో తురిమిన మల్లె చెండుతో పయ్యారంగా, టపాకాయలు కాల్చటానికి దీపాల వద్ద కూర్చున్నావు. నేను మా అరుగుపైన నిలబడి మా తమ్ముళ్ళ మతాబులు కాలుస్తుంటే చూస్తున్నాను. ఇంతలో మా చిట్టి తమ్ముడు డుంబు సిసింద్రీలు తెచ్చి, 'ఇవి కాల్చు! బాగుంటాయన్నయ్యా' అంటూ వచ్చాడు. వాడి కోసం అని ఒక సిసింద్రీ దీపం వద్ద ముట్టించి వీధిలోకి గిరవాటేశాను. . . . . . ."

"అది ఎగిరి నాపైన పడింది. నా చీర కుచ్చెళ్ల మధ్య అంటుకుంది. పక్కనే ఉన్న మా నాన్నగారూ, అమ్మా వెంటనే ఆర్పివేశారు. కాని. అప్పటికే నాచీర కుచ్చెళ్ళ మడతలన్నిటిలో కన్నం పడింది." అంది రాధ.

## గమనిక

సమీక్షార్థం రెండు ప్రతులు 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు-2'కు పంపవలసిఉన్నది.

—ఎడిటర్







"అప్పటివరకూ నీతో నేను ఎప్పుడూ మాట్లాడలేదు. మా ఇంటి కెదురుగా ఉంటూ, మా ఇంట్లో ఎంతో చనువుగా తిరుగుతున్నప్పటికీ— ఈ సంఘటన జరిగిన వెంటనే ఎందుకో నా మనస్సు క్షోభ పడింది. నీ కొత్త చీర కాల్చి నందుకేమో? వెంటనే మీ నాన్నగారి వద్దకు వచ్చి క్షమార్పణ చెప్పుకున్నాను. ఆ సమయంలో గుమ్మంలో నిలుచున్న నీవు అదోలా చూశావు. ఆ చూపు ఇప్పటికీ నాకు గుర్తుంది. మీ నాన్న గారు చాలా మంచివారు. ఆ రోజు లటువంటి ప్రమాదాలు తప్పక జరుగుతాయన్నారు. నవ్వుతూ నన్ను చూచి "క్షమించం"దన్నారు.

"నీవు చిన్నగా నవ్వి, చేతులు జోడించి, 'ఈ పొరపాటు మీది కాదు. ఆ సిసింద్రీది. అది నా మీదకే ఎందుకు రావాలి?" అన్నావు. అంతా నవ్వేశారు. ఆనాటి నుండి నీవు ఎప్పుడు మా ఇంటికి వచ్చినా దొంగచాటుగా మాట్లాడి వెళ్లిపోయే దానివి. గుర్తుందా?" అన్నాడు భాస్కర్.

"ఇప్పుడిదంతా నాకెందుకు గుర్తు చేస్తున్నారు?" అని అడిగింది రాధ.

"అదే! జీవితపు తొలి భావాలు ఎంత గాఢంగా హృదయంలో హత్తుకు పోతాయో, చూడు! ఇంత మధురంగా నా ఎదలో ముద్ర పడ్డా నా వెనుకటి జీవితం ఎప్పుడు గుర్తుకు వచ్చినా నాకు మిగిలేది బాధే. అప్పుడనుకుంటాను, రాధాదేవిని వంచిస్తున్నానని. నాకు చిత్రం అని పిస్తుంది. — స్త్రీలో ఇంత అనురాగం, ఇంత అభిమానం, ఇంతటి మహోత్కృష్టమైన ప్రేమ, ఇంతటి సహనం ఎట్లా ఇముడ్చగలిగాడా భగవంతుడు అని. పైగా ఆమెను అబల అంటారు. నమ్మదగ్గ విషయమా? ఇక నిన్ను వంచించ దలుచుకోలేను. రాధా! నిజాన్ని దాచడం ఇక నా తరం కాదు. నీ నిష్కల్మషమైన ప్రేమ ముందు, నా వంచన నిలవటానికి ఇక స్థానం లేదు." అని జేబులో నుండి సిగరెట్టు తీసి వెలిగించి గట్టిగా దమ్ములాగి తిరిగి ప్రారంభించాడు భాస్కర్.

"ఒకప్పుడు మంచి కూడా మందులా చేదుగా ఉంటుంది. కాని, నేనేం చెయ్యను చెప్పు? ఇక ఈ విషయాలన్నీ నీకు చెప్పక తప్పదు......"

"అవి నేను కాలేజిలో ఫస్టియర్ చదువుతున్న రోజులు. అసలే కాలేజీ వాతావరణం కొత్త. అందులో పెద్ద పెద్ద ఆడపిల్లలతో కలిసి చదవటం మరీ కొత్తగా, భయంగా ఉండేది. మా క్లాసులో అయిదుగురు విద్యార్థినులు ఉండేవారు. అందులోకల్లా చిన్నపిల్ల (అంటే 16 సంవత్సరాలు) మార్గరెట్ అనే క్రైస్తవ అమ్మాయి. నల్లని రంగైనా, చూడ ముచ్చటైన కళ్ళు, కొనదేరిన ముక్కు, అందుకు తగ్గ నోరు, ఆ కోలముఖంలో తీర్చి దిద్దాడు భగవంతుడు. క్లాసులో ఆమె వెనుక సీటు నాది. హైస్కూలులో అయిన అలవాటు ప్రకారం లెక్చరర్ ప్రశ్న

(తరువాయి 18 వ పేజీలో)


## ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

# పరాభవ ఉగాది నవలల పోటీ

## 5,500 రూ. బహుమతులు

ప్రతి ఏడాది వలెనే పరాభవ ఉగాది సందర్భంలోనూ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక నవలల పోటీ నిర్వహిస్తున్నది విశ్వావసు ఉగాది నవలల పోటీకి 4,500 రూపాయల బహుమతులు ఇచ్చాము. రచయితలను ఇతోధికంగా ప్రోత్సహించే నిమిత్తం పరాభవ ఉగాది నవలల పోటీకి 5,500 రూపాయల బహుమతులు ఇవ్వడానికి నిశ్చయించాము.

రచయితలు, రచయిత్రులు ఈ అవకాశం వినియోగించుకొని, పాఠకులకు ఉత్తమమైన నవలలు అందజేయాలనే మా పూనిక సఫలం కావడానికి తోడ్పడాలని అర్థిస్తున్నాము.

| | |
|---|---|
| మొదటి బహుమతి | 3,000 |
| రెండవ బహుమతి | 1,500 |
| మూడవ బహుమతి | 1,000 |

పోటీలో పాల్గొనేవారు పాటించవలసిన నిబంధనలు ఇవి :

1. రచన 250 పేపుతావు కాగితాలకు మించరాదు.
2. సిరాతో కాగితానికి ఒకవక్కనే వ్రాయాలి.
3. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
4. స్వీయ రచనలే కాని, అనువాదాలు అనుసరణాలు పంపరాదు.
5. కవరు మీద 'ఉగాది నవలల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.
6. బహుమతి పొందని రచనలలో యోగ్యమైనవి ఆంధ్రప్రభ సచిత్రవారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
7. బహుమతి పొందని రచనలలో ప్రచురార్హం కానివాటిని తిప్పి పంపేనిమిత్తం తగుమాత్రం తపాలా బిళ్ళలు అంటించిన, చిరునామా ఉన్న కవరు జతపరిచి పంపవలసి ఉన్నది. లేకపోతే వాటిని తిప్పిపంపడం జరగదు.
8. రచనలు 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు—2' కు పంపాలి.
9. ఈవిషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

**బహుమతి పొందిన నవలల ప్రచురణ ఉగాది ప్రత్యేక సంచికలో ప్రారంభం అవుతుంది**

**ఉగాది నవలల పోటీకి రచనలు మాకు చేరవలసిన తేదీ | 1966 జనవరి 31**

# ఆంధ్రప్రభ

సచిత్ర వారపత్రిక

*1965, నవంబరు 1 నుంచి*

**కొత్త ప్రకటన రేట్లు**

కాజువల్ : కాలం సెం. మీ. 1 కి 7—50

కంట్రాక్టు: కాలం సెం. మీ. 1 కి రు. 6—80

(250 సెం. మీ. లు, ఆపైన)

(ప్రకటన కనీస స్థలం సెం. కాలం— 5 సెం. మీ. లు)

**అట్ట పేజీలు**

**4 వ పేజీ-రెండు రంగులు**

కాజువల్ : ప్రకటన 1 కి రు. 1100/—

కంట్రాక్టు : ప్రకటన 1 కి రు. 950/—

(కనీసం 6 ప్రకటనలు)

**2 వ పేజీ, 3 వ పేజీ— ఒక రంగు**

కాజువల్ : ప్రకటన 1 కి రు. 700/—

కంట్రాక్టు : ప్రకటన 1 కి రు. 600/—

(కనీసం 6 ప్రకటనలు)

**కొలతలు :**

కాలం వెడల్పు 5 సెం. మీ.

కాలం పొడవు 23 సెం. మీ.

పేజీకి 3 కాలాలు

*ఇతర వివరములకు విచారించువారికి వ్రాయండి:*

**అడ్వర్టయిజ్‌మెంట్ మానేజర్,**

**ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక**

**ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు- 2**


# పిరికివాడు

( 11 వ పేజీ తరువాయి)

సమ్మతం తప్పనా నేను లేని నిజాన్ని సమాధానం చెప్పటానికి ప్రయత్నించే వాడిని, ఆ ప్రశ్న నన్నడగక పోయినా. ఇది చూసి ఆమె నవ్వుతూ ఉండేది.

"ఒకరోజు నేను కాలేజీ నుండి ఇంటికి వస్తూండగా ఎవరో నన్ను పిలుస్తున్నట్లనిపించి. నేను తిరిగి చూసేసరికి నవ్వుతూ మార్గరెట్ నన్ను సమీపించింది. అసలే భయస్థుణ్ణి, అందులో వీధిలో ఆమె పలకరించగానే నా ఒళ్ళు వణకటం ప్రారంభించింది. ఆమె నా దగ్గరగా వచ్చి, 'చూడండి, భాస్కర్ గారూ! మీ ఇంగ్లీషు నోట్సు ఒకసారి ఇస్తారూ?' అని అడిగింది. నాకు మాటలు తడబడుతున్నాయి. 'తా ...... తొందరగా రేపు పుస్తకం .... ఇవ్వ య్యండి.' అంటూ ఆమెకు పుస్తకం ఇచ్చాను.

"భలేవారే! ఒక్క రోజులో ఇచ్చెయ్యనా!" అని చిలిపిగా కళ్ళు తిప్పుతూ.

"ఆ తర్వాత ప్రేమలేఖలు వ్రాసుకున్నారు. అంతేనా?" అంది రాధ నవ్వుతూ.

"నిజంగా అంతే జరిగింది! నా పుస్తకాలలో ప్రేమలేఖలు పెట్టి ఇచ్చేది. మొదట్లో ఏదోలా తోచినా రాను రాను ఆ చిలిపి కళ్ళతో నా హృదయంలో గిలిగింతలు పెట్టి, స్త్రీ అంటే భయపడే నాలో కొత్త భావాలు ప్రవేశపెట్టింది మార్గరెట్. నా ఎదలో ఏదో కొత్తదనం, నా మదిలో సంచలనం, నా చేతలలో మార్పులనూ, నా మాటలలో చిలిపితనం నాకు తెలియకుండానే ప్రవేశించాయి. నా హృదయాన్ని దోచుకుంది మార్గరెట్. నన్ను పూర్తిగా వశపరచుకుంది. నేను వాళ్ళ ఇంటికి వెళ్ళేవాడిని. ఆమె తల్లి దండ్రులు నన్నెంతో గౌరవించేవారు."

"కాని పెళ్ళి మాత్రం జరగలేదు. ఏం? అంతేనా?" అని అడిగింది రాధ.

"వేళాకోళం కాదు, రాధా! ఇది ఒక జీవిత సత్యం! నాకు తెలుసు, మా ప్రణయం ప్రణయంగానే తప్ప వైవాహికంగా చేరలేదని. ఎందుకంటే — ఇద్దరిదీ కులమత భేదం అడ్డు వచ్చింది. పెద్దల ఆమోదముద్ర పడదు. మార్గరెట్‌కు ఈ విషయాలన్నీ నచ్చ చెప్పాను. కానీ, 'నా సర్వస్వం త్యాగం చేస్తాను. నా వాళ్ళను విడిచి పెడతాను. నీవు తప్ప నాకింకేమీ అక్కర లేదు, భాస్కర్' అనేది.

"కాని నామాటో? నేనంతవరకు ఈ సంఘాన్ని, కట్టుబాట్లను ఎదిరించ గలిగేదే పెద్ద సమస్య. మా తల్లిదండ్రులు ఒప్పుకోరన్నది నిజం. ఆమెకు నా స్థితి వివరించి చెప్పాను. కాని, ఆ 'ప్రేమ పిచ్చిది' నామాట వినిపించు కుంటేనా? 'నాకు పెళ్ళక్కర లేదు. నీవెక్కడున్నా ఇలా నన్ను హృదయపూర్వకంగా ప్రేమిస్తే చాలు. ఈ జీవితానికి ఈ సుఖం చాలు. నన్ను జన్మలో నీ కులంలో పుట్టి నన్ను పెళ్ళాడతావు' అనేది.

"సెకండియర్, థర్డియర్ కూడా ఇట్లానే ఆడుతూ పాడుతూ గడిపేశాం. మద్రాసు, హైదరాబాదులోని గార్డెన్స్, సినిమాలు, గోల్కొండ కిల్లా, గార్డెన్స్‌లో విహారయాత్ర చేసింది. కాని, ఇంతలో వచ్చింది అగాధం. వాళ్ళ నాన్నగారికి హైదరాబాదు నుండి విశాఖపట్నం బదిలీ అయింది. రేపు ప్రయాణం అనగా, నన్ను కలుసుకుని మార్గరెట్ వెక్కి వెక్కి ఏడుస్తూ తనుకుంటూ నా నుండి వెళ్ళిపోయింది."

"భాస్కర్! నన్ను పూర్తిగా మరచిపోతావా? మొదటి నుండి, ఈ ప్రేమంటే నీకు ఇష్టం లేకుండానే నన్ను ప్రేమించావు. నాకు మాత్రం నమ్మకముంది. రెండు నెల్లో మన వివాహం నిశ్చయమయ్యేటి కదూ! అంతవరకు ఎక్కువ కాలం నేను ఉండలేను. వెళ్ళగానే ఉత్తరం వ్రాస్తాను. జవాబు వ్రాస్తావు కదూ?' అంటూ కన్నీళ్లలో మునిగింది.

నా హృదయం చలించి పోయింది. అంతవరకూ నాలో కలగని కొత్త వేదన కలిగింది.

'చూడు, మార్గరెట్! ఇంతవరకూ ఈ ప్రేమ విషయంలో ఒక నిర్ణయానికి రాలేక పోయాను. కాని, ఇప్పుడిప్పుడే నాలో ధైర్యం కలుగుతోంది. ఈ విషయంలోనే ఆలోచించి నిర్ణయం చేస్తున్నాను. అయినా ఫరవాలేదు. మన ప్రేమకు అడ్డు నిలవలేరెవ్వరూ. నీకు తప్పక జాబులు వ్రాస్తాను. రెండు మూడు నెలలో అన్ని విషయాలు ఒక దారికి తేవటానికి ప్రయత్నిస్తాను.' అన్నాను ఆమె కన్నీళ్ళు తుడుస్తూ.

"ఆమె వెళ్ళిపోయింది. మార్గరెట్ వెళ్ళిపోయింది నా నుండి దూరంగా. ఆమె నుండి రెండు మూడు జాబులొచ్చాయి. వాటికి జవాబు వ్రాశాను. అంతే. ఆ తరువాత ఆమె నుండి జాబు లేదు. నాకు అనుమానం కలిగింది. ఆమె మనస్సైనా మార్చుకుని ఉండాలి. లేక బలవంతంగా పెళ్ళయినా జరిగి ఉండాలని. ఈ ఆలోచనలో పిచ్చివాణ్ణయిపోయానంటే నమ్ము."

"అయితే — ఇతరులా ఆమె వేరొకరిని వివాహం ....... అని ఏదో అడుగబోయింది రాధ.

"ఆరే! అది తెలుసుకోవాలనే వెంటనే బయలుదేరి విశాఖపట్నం వెళ్ళాను. సముద్రంలో అమాయక పెట్టూ లేదో పిడుగు లాంటి వార్త నా చెవిన పడింది. నా హృదయం వికాపికలై పోయింది. ఇంకా నేనెందుకు బ్రతికి ఉన్నానా అని పించింది. 'ఆ మహమ్మారి వ్యాధి నా మార్గరెట్‌కే రావాలా!' అంటూ బాధపడుతున్నాను.

"రాధాదేవి ! నా జీవితంలో మొదటి అధ్యాయం ఈ విధంగా పరిసమాప్తి అయింది" అంటూ జేబులో నుండి రుమాలు తీసి కళ్ళు తుడుచు కున్నాడు భాస్కర్.

మూర్తి కండ్లు ఎర్రబారి బాధా పూరితా లయ్యాయి.

రాధ చెక్కిళ్ళపై ముత్యాలు రాలాయి.

## 2

అప్పుడే పబ్లిక్ గార్డెన్సులో లైట్లు వెలిగించారు. ఆ వెలుగులో జలుగులైనాయి రాధ చెక్కిళ్ళ పైని ముత్యాలు.

భాస్కర్ సిగరెట్ వెలిగించి ఒక్క దమ్ము లాగి ఎటో చూస్తూ దీర్ఘంగా ఆలోచిస్తూ మళ్ళా చెప్పటం మొదలు పెట్టాడు.

"రాధాదేవీ! ఇక నా జీవితపు రెండవ అధ్యాయం విన్నావంటే నీ[illegible] పవిత్ర స్త్రీకి, భగవంతుడు నాలాంటి శిక్ష విధిస్తాడో అనిపిస్తుంది. ఇది విన్నావంటే ప్రేమించడం నాకు చేతకాదంటావు..." అన్నాడు.

"చాల్లే బాబూ! మారింకేం చెప్పవద్దు. ఇప్పుడు చెప్పింది చాలు. ఇంతటి బాధను హృదయంలో ఎట్లా దాచుకో గలిగారని. నామాట వినండి. మీతోపాటు మీ బాధలను, మీ సంతోషాన్ని నన్ను కూడా పంచుకో నివ్వండి" అంటూ అతని చేతులు పట్టుకుని ప్రాధేయ పడింది రాధ.

కాని భాస్కర్ మనస్సు పిసరంత కూడా మారి నట్లు కనిపించలేదు.

"కాదు, రాధాదేవీ! నన్నిక మరో సమస్యలో ముంచకు. ఇప్పటికే తప్పులు చేసి చేసి నామనసు మొద్దుబారి పోయింది. అసలు మానవుడు తప్పు చేసినప్పుడు సరియైన శిక్ష విధిస్తే తిరిగి అదే తప్పును చెయ్యడు. కాని, నా విషయంలో మాత్రం అంతా వ్యతిరేకం. ఏదో బలహీనత నన్ను వెంటాడు తుంది. నా జీవితం నాకేగాదు, వేరెవ్వరికీ కూడా ఉపకారి కాదు."

"భాస్కర్! ఇక ఇంటికి వెళదాం. ప్రొద్దు చాలా అయింది" అన్నాడు మూర్తి, అతని దృష్టి మార్చాలని. కాని, భాస్కర్ ఈ మాటలు వినలేదు. అసలు మూర్తిని గమనించనేలేదు.


"ఈ విషయాలన్నీ నీకు చెప్పకపోతే, నా అంత రాత్మ నన్ను మోసగాడుగా, దగా కోరుగా, వంచ కుడుగా, పరిగణించి రంపపుకోత పెడుతుంది. ఆత్మకు శాంతి ఉండదు. ఇక నేను ఆత్మవంచన చేసుకోలేను. నీకు నిజం చెప్పి; నా ఈ మిగిలిన జీవిత కాలాన్ని నిర్మలం చేసుకుంటాను" అతని కంఠం రుద్ధమైంది.

కొంతసేపు నిశ్శబ్దం రాజ్యం చేసింది ఆ ప్రదే శంలో. తిరిగి భాస్కర్ ప్రారంభించాడు.

"అవి నేను కొత్తగా ఉద్యోగంలో చేరిన రోజులు. ప్రతిరోజూ చిక్కడపల్లి నుండి బస్సులో సెక్రటేరియట్ దాకా వెళ్ళి అక్కడి నుండి నడిచి ఖైరతాబాద్‌లో ఉన్న మా ఆఫీసుకు వెళ్ళేవాడిని. అదే బస్సులో ఒకామె ఎక్కేది. సన్నగా, పొడుగ్గా, పొడుగాటి వాల్జడతో, ఒకే తెల్ల గులాబితో, కాటుక కళ్ళు, ఎర్రని కుంకుమ బొట్టుతో— చాలా అందంగా ఉండేదామె. ఆమె పేరు సునంద. ఆమె ఖైరతాబాద్‌లోనే ఉమన్ వెల్‌ఫేర్ బోర్డులో పని చేసేది.

"ఒకరోజు బస్సులో జరిగిన సంఘటన మూలంగా ఆమె నాకు పరిచయం అయింది. ఆ రోజున ఆమె బస్ స్టాపుకు లేటుగా వచ్చింది. అప్పుడే మా బస్సు బయలుదేరింది. డ్రైవర్ ఆమెను చూచి కూడా బస్సు ఆపలేదు. అది చూసిన నేను బెల్లు కొట్టాను. బస్సు ఆగింది. ఆమె ఎక్కింది. కాని, తిరిగి కండక్టర్ బెల్ ఇవ్వలేదు. 'ఏమని అడిగితే' ఇప్పుడు ఎక్కినామె దిగిపోతే బెల్ ఇస్తా' అన్నాడు. పాపం సునంద చాలా సిగ్గు పడిపోయింది. బాధతోనే క్రిందకు దిగిపోయింది. అంతే, బస్సులోంచి మేమంతా కూడా దిగిపోయి, ఆర్. టి. సి. ఛైర్మన్‌కు రిపోర్టు చేశాము.

"ఇది మా పరిచయానికి మూలకారణం. అది మొదలు రోజూ బస్సులో కలుసుకుంటూ సాయం కాలం ఆఫీసు నుండి వచ్చేటప్పుడు ఒక ప్రదేశంలో కలుసుకొని నడిచి ఇంటికి రావటం జరుగుతూ



విపరీత వాహనయోగం

చిత్రం — ఎస్. చంద్రశేఖర్ (హైదరాబాదు-12)

ఉండేది. ఒకనాడు ఇద్దరం హుస్సేన్ సాగర్ బండిపై కూర్చుండగా ఆమె వ్యక్త పరిచింది, నన్ను ప్రేమి స్తున్నట్లుగా. నేను ఆక్షేపణ వ్యక్తం చేశాను. నాకు ప్రేమపై విశ్వాసం లేదన్నాను. స్నేహాన్ని స్నేహంగానే ఉండనివ్వమన్నాను.... ఆమె వినిపించు కోలేదు. నీ మాదిరే......"

రాధ చిన్నగా నవ్వింది.

"నీవడుగుతావు—నీవు మాత్రం ప్రేమించ లేదా? ఇన్నాళ్ళు ఆమె సాన్నిధ్యాన్ని కోరలేదా? ఆమెతో గడిపినంతసేపూ ఆనందంగా లేనా?" అని. నాకు తెలుసు. నీలో ఈ ప్రశ్న ఉద్భవిస్తుంది. కాని, అక్కడే ఉంది కిటుకు. నేను కోరేది పట్టి స్నేహం. ప్రేమించే హక్కు నాకు లేదు. దానిని మార్గరెట్‌తోనే కోల్పోయాను. సునందతో నేను స్నేహాన్నే కోరాను. ఇటువంటి సంఘటనకు తావు లేకుండా చేద్దామనే నా ప్రయత్నం. కాని, ప్రతి స్త్రీలోనూ, పురుషునిలోనూ ఏదో ఒక బలహీనత ఉంటుంది. వాళ్ళని అట్టి బలహీనతే నన్ను క్రుంగ దీస్తోంది.

"తరువాత కొన్నాళ్ళు ఆమెను తప్పించుకు తిరిగాను. అది కనిపెట్టి ఆమె నేను వచ్చే వరకూ బస్సు ఎక్కడం మానేసేది. సాయంకాలం మా ఆఫీ సుకు కొంచెం దూరంలో నా కోసం ఎదురు చూస్తూ నిల్చునేది. ఇలా, నే వద్దనుకున్నా వెంటాడింది. తనను మోసం చేస్తున్నానంది. ఇన్నాళ్ళూ తనను కూడా తిప్పుకుని, ఏవో భావాలు రేపి, ఇప్పుడు ప్రేమించటం లేదనటం భావ్యం కాదన్నది. ఆమెకు మార్గరెట్‌తో నా ప్రేమ విషయం చెప్పాను అప్పటికైనా నన్ను అర్థం చేసుకుంటుందేమోనని. కాని, ఆమె నా మాటలు నమ్మలేదు. అదంతా అబద్ధం అంది. తన మన స్సును మార్చుకోలేనన్నది. ఇది నాకు విషమ సమస్య అయిపోయింది. ఆమె కన్నీరు రోజూ చూడలేక పోయాను. నేను కూడా నా మనస్సును కొంతవరకు మార్చుకున్నాను. కొన్నాళ్ళకు ఇద్దరం పరస్పరం అర్థం చేసుకో గలిగాము. పెళ్ళి చేసుకోడానికి కూడా నిశ్చయించుకున్నాం. ఈ విషయంలో ఆమె తొందర మరీ ఎక్కువై పోయింది."

"కాని, ఆమెతో కూడా మీ వివాహం జరుగ లేదుగా! ఆమె దగా చేసిందా? లేక మీరే ఆమెను దగా చేశారా?" అని అడిగింది రాధ.

"ఒకరినొకరం దగా చేసుకున్నాం." ఆలోచనా మగ్నుడైన భాస్కర్ సమాధానం.

# పిరికివాడు

"అంటే?"

"అదే! మొదటి నుండి, నాలో ప్రేమించే శక్తి లేక నేను దగా చేశాను. ఇక ఆమె వంతు వచ్చింది. అమెరికా నుండి తిరిగి వచ్చి, ట్రాంబేలో అటామిక్ ఎనర్జీ ఎస్టాబ్లిష్‌మెంటులో సైంటిస్టుగా చేరిన, మేన బావను ఆమె వివాహం చేసుకుంది."

"నిజం...?" ఆశ్చర్యంగా అడిగింది రాధ.

"అబద్ధం మాత్రం కాదు! ఆశ్చర్యం అంత కన్నా కాదు. ఆమె ఒక స్త్రీ. స్త్రీకి కావలసింది పురుషుని అంతస్తు, హోదా, డబ్బు. అంతేకాని ప్రేమ కాదు. సైంటిస్టుగా వచ్చిన ఆమె బావ ముందు నన్ను నిలబెట్టి నా వ్యక్తిత్వాన్ని బేరీజు వేసింది మనందరి. ఆమె అంచనాకు నేను అందలేదు. అందుకే దూరంగా రమ్మంది."

"అసలు ఏం జరిగింది?" ఆత్రతగా అడిగాడు అంతవరకూ నిశ్శబ్దంగా వింటున్న మూర్తి.

"కొత్త విషయమేం జరుగ లేదు. ఒక రోజు ఆమె బొంబాయి వెళ్లుతున్నట్లు చెప్పింది. అంతే. ఎందుకు వెళ్లుతూందో, ఎప్పుడు తిరిగి వస్తుందో నాకు చెప్పలేదు. పది రోజుల తర్వాత ఒక శుభలేఖ, దానితో ఒక ఉత్తరం అందాయి. ఆ శుభలేఖ ఆమె వివాహానిది, ఉత్తరం నాది! నా కోసం వ్రాసినది."

"ఏమని వ్రాసింది?" రాధ అడిగింది.

"నే అనుకున్నట్లే వ్రాసింది." అంటూ జేబులో నుండి ఒక కాగితం తీసి చదవటం మొదలు పెట్టాడు.

"భాస్కర్! మీరు మొదటి నుండి నాయందు ప్రేమ లేకుండానే ఉన్నారు. మీరు నా స్నేహాన్నే కోరారు. కాని, నేనే పొరపాటు పడ్డాను. నా మీద ప్రేమలేని వ్యక్తితో నేను సంసారం చెయ్యలేనని ఇప్పుడు తెలిసింది. బావకు! మా బావకు! నేనంటే ఎంత ప్రేమో! మా నాన్న గారితో అన్నాడు, మునందను పెళ్లి చేసుకుంటానని. అంతే నాకెంత సిగ్గయిందో! అలా అనగానే నా హృదయం ఉప్పొంగి పోయింది. అప్పుడాలోచించాను — మీతో కలిసి తిరిగినన్నాళ్లూ ఎప్పుడైనా నా హృదయం ఇంత ఆనందాన్ని పొందగలిగిందా అని. లేదు. దానికి జవాబు లేదు.

"మీ ఇష్టం లేకపోయినా మిమ్మల్ని బలవంతంగా ప్రేమించి, మీచేత ప్రేమించబడటం నా కిష్టం లేదు. మీరన్నట్టు మన స్నేహం స్నేహంగానే ఉండనివ్వండి. ఎప్పుడైనా హైదరాబాదు వచ్చినప్పుడు తప్పక కలుస్తాను. ఈలోగా మీరు మీ మార్గరెట్‌ను మరచిపోయి వివాహం చేసుకుని మనశ్శాంతి పొందండి.

ఇంక ఇంతకన్నా ఏం వ్రాయను?

ఇట్లు
మునందిని."

తిరిగి కాగితాన్ని మడిచి జేబులో పెట్టుకున్నాడు.

"ఇదీ, రాధాదేవి, నా జీవితపు రెండవ అధ్యాయం. ఇక నేను ఈ నాటకంలోని పాత్రలు నటించలేను. నన్ను నేను వంచించుకోలేను. ఇతరులను వంచించలేను. నన్ను బాగా అర్థం చేసుకో."

ఎం. ఎ. పాసై, తనతోపాటు స్టాటిస్టికల్ అసిస్టెంటుగా పని చేస్తూ హుషారుగా తిరిగే భాస్కర్ హృదయంలో ఎంతటి అగ్ని పర్వతాలు ప్రజ్వరిల్లుతున్నాయోనని ఆశ్చర్యపోయాడు మూర్తి.

"అబ్బ! ఎంత దగా చేసింది మిమ్మల్ని. నిజమే. ఇలాంటి స్త్రీలు కూడా ఉంటారు ప్రపంచంలో" అంది రాధ నిట్టూరుస్తూ.

"రాధాదేవి! నా పై జాలి పడవద్దు. ప్రేమించానని నాపై జాలి మాత్రం చూపవద్దు. నిజం నీకే కొన్నాళ్లకు బోధపడి, నాయందు జాలి తప్ప ప్రేమ లేదని తెలుసుకుని ఈ జీవితం వెగటనిపించి నానుండి దూరంగా పారిపోతావ్!"

"లేదు, భాస్కర్! అట్లా ఎన్నటికీ కాదు. మీ సాహచర్యం నాకు కావాలి. మీ హృదయాన్ని పూర్తిగా ఆక్రమించుకునే శక్తి నా కిమ్మని భగవంతుణ్ణి ప్రార్థిస్తాను."

"కాదు, రాధాదేవి! ఈ విషయం నీవు బాగా ఆలోచించుకో! తొందరపాటులో నిర్ణయం చెయ్యవద్దు. నీ నిర్ణయం ఎట్లాంటిదైనా నాతో చెప్పు. అయ్యో! భాస్కర్‌ను బాధ పెట్టానే అని మాత్రం నీవు బాధ పడవద్దు. ఈ విషయంలో నేనెవ్వరినీ దూషించను." ఆగాడు.

నిట్టూర్చింది రాధ.

"బాగా చీకటి పడిపోయింది. ఎనిమిదిన్నర అయింది. తొందరగా నడు" అంటూ లేచాడు భాస్కర్.

నిశ్శబ్దంగా, వినమ్రుడైన శ్రోత మూర్తి, బద్ధకంగా లేచాడు బరువైన గుండెతో.

రాధ ఆలోచనా మగ్న మానసయై మెల్ల మెల్లగా నడవసాగింది.

అంతా బయటకు వచ్చారు. పబ్లిక్ గార్డెన్సు కళా విహీనంగా తయారైంది. ఆమెను బస్సు ఎక్కించి, భాస్కర్, మూర్తి క్లాక్ టవర్ పక్క నుండి, బషీర్ బాగ్ మీదుగా, చిక్కడపల్లికి నడక సాగించారు.

## 3

మరునటిరోజు ఉదయం రాధ, భాస్కర్‌ను వాళ్ల ఇంట్లో కలుసుకుని సాయంకాలం నౌబత్ పహాడ్ పైకి రమ్మని చెప్పి వెళ్లింది.

భాస్కర్ ఆఫీసుకు వెళ్లాడన్నమాటేగాని అతనికి పనిచెయ్య బుద్ధిపుట్టలేదు. సాయంకాలం రాధ ఏ నిర్ణయంతో వస్తుందో అని దిగులుగానే ఉన్నట్టుంది. అతని మస్తిష్కంలో భరింపరాని ఘర్షణ జరుగుతూంది. రాధను వదులుకోలేడు; చేపట్టలేడు. ఆమెను వంచించి కాలాన్ని గడపడం అతనికి ఇష్టం లేదు. ఇట్లా ఏ నిర్ణయానికి రాలేక బాధపడుతున్నాడు. ఆత్మ అంటుంది—'రాధ ప్రేమను అనుమానించవద్దు. రాధ అందరిలాంటి స్త్రీ కాదు. మనస్ఫూర్తిగా నిన్ను ప్రేమించింది. నిన్నే నమ్ముకుంది' అని. మనస్సు అంటుంది—'రాధ కూడా ఒక స్త్రీయే. ఆమెను నమ్మమని ఎక్కడుంది?' అని. ఈ ఘర్షణలో నలిగిపోతున్నాడు. పాపం! ఏదో బలహీనత — పిరికితనం అతని మనస్సును ముందు పోనీకుండా అపు చేస్తూంది.

ఈ ఆలోచనలతో ముచ్చెమటలు పట్టాయి. కొంతసేపటికి ఏదో నిర్ణయానికి వచ్చినట్టున్నాడు. కాగితం, కలం తీసుకుని వ్రాయటం మొదలు పెట్టాడు. పదిహేను, ఇరవై నిమిషాలు పట్టింది వ్రాయటం పూర్తి చేసేటప్పటికి. కాగితం మడత పెట్టి, కవరులో పెట్టి అంటించి, దానిపై అడ్రసు వ్రాసి తిన్నగా మూర్తి వద్దకు వెళ్లాడు.

అంతవరకూ వ్రాసుకుంటున్న మూర్తి, భాస్కర్ రావటం, అతని వాలకం గమనించి అతనితో కూడా బయటకు నడిచాడు. గేటు బయటకు వచ్చి భాస్కర్, ఆ కవరును మూర్తి చేతులలో ఉంచి "సాయంకాలం ఆరు గంటలకల్లా రాధ నౌబత్ పహాడ్ పైకి వస్తుంది. ఆమెకు ఈ కవర్ అందజెయ్యి. ఈ స్నేహితునికి ఈ మాత్రం సహాయం చెయ్యి" అన్నాడు రుద్ధమైన కంఠంతో ....

ఏటి ఒడ్డున నిశ్చలత

చిత్రం—ఎమ్ రామరాజు (రాయపూర్)



"అరె! అల్లా బాధ పడతావెందుకు, భాస్కర్! అసలు ఏం జరిగింది ? అయినా ముఖాముఖి మాట్లాడక ఉత్తరాలెందుకు? ఆమె మరింత బాధపడటానికా ?" అన్నాడు మూర్తి.

"లేదు, మూర్తీ! నేను రాలేను. నీవు వెళ్ళు. నన్ను ఈ విషయంలో మాత్రం క్షమించు" అంటూ మాటయినా వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు భాస్కర్. మూర్తికి ఇదేమీ అర్థం కాలేదు.

సాయంకాలం ఆఫీసు నుండి తిన్నగా హోటల్‌కు వెళ్ళి కాఫీ త్రాగి, ఆరు గంటలకల్లా నౌబత్ పహాడ్ చేరుకున్నాడు మూర్తి. ఈ సంఘటన అతనిని ఎంతో బాధ పెడుతూంది. తనొక్కడూ ఇక్కడకు రావటం, రాధ తనను చూచి ఏమనుకుంటుందో అని పరిపరివిధాల పోతూంది మనస్సు.

కొంతసేపటికి రాధ హుషారుగా, టిప్‌టాప్‌గా తయారయి రావటం చూచాడు, నవ్వుతూ. దూరం నుండే భాస్కర్ కొరకు వెతుకుతున్నాయి ఆమె చూపులు. కాని, భాస్కర్ జాడ కనిపించలేదు. ఆమె ముఖం వివర్ణమైంది. మూర్తి చిన్నబుచ్చుకున్నాడు. దగ్గరకు వచ్చి మూర్తిని చూచి, నవ్వు తెచ్చిపెట్టుకోడానికి ప్రయత్నించింది రాధ. ప్రయత్నం విఫలం కాగా—"భాస్కర్‌గారు రాలేదా, మూర్తిగారూ!" అంది. దాచుకుందామని ప్రయత్నం చేసినా దాగటం లేదు ఆమెలోని ఆవేశం, దుఃఖం.

మూర్తికి నోట మాట రాలేదు. కొంతసేపటికి తేరుకుని "రాలేదండీ! కాని, ఈ ఉత్తరం మీకు ఇవ్వమని ఇచ్చాడు. నేను చెప్పాను — ఉత్తరాలకన్నా ముఖాముఖి మాట్లాడుకోవటం మంచిదని. కాని, ఈరోజు ఆదోలా ఉన్నాడు. నన్ను బ్రతిమిలాడాడు, ఈ ఉత్తరం మీకివ్వమని" అని చెప్పాడు మూర్తి.

రాధ అతని చేతిలో ఉత్తరం అందుకుని కవరు చిప్పి చదవటం మొదలుపెట్టింది. అందులో ఏమంత విశేషముందోగాని, ఆమె చదువుతున్నంత సేపూ ఆమె ముఖం పాలిపోయింది. ముచ్చెమటలు పట్టాయి. పెదాలు వణుకుతున్నాయి. ఇది చూచిన మూర్తి, ఆ ఉత్తరంలో భాస్కర్ ఏమి వ్రాశాడో అర్థంకాక కంగారుపడిపోయాడు.

ఉత్తరం చదువుతూనే రాధ ముఖం తిరిగి కింద పడిపోయింది. మూర్తికి ఏం చెయ్యటానికి తోచలేదు. అక్కడే ఉన్న పంపునుండి నీళ్ళు తెచ్చి రాధ ముఖంపై చల్లాడు. ఇది చూచి అక్కడి జనం చుట్టూ మూగారు. పాపం! మూర్తి సిగ్గుపడిపోతున్నాడు. కొంతసేపటికి రాధ తేరుకుంది. కాని, ఆమె ఏడుస్తూంది. ఆమె చేతిలోని ఉత్తరాన్ని తీసుకుని చదవటం ప్రారంభించాడు మూర్తి.

"రాధా!

ఈ విధంగా నిన్ను సంబోధించే హక్కు నాకు లేదు. నన్ను క్షమించు. నాలోని ఏదో బలహీనత నన్ను మొదటి నుండి వెంట తరుముతూంది. కాలేజీలో చదివే రోజుల్లో కూడా ఇట్లాగే — ఏదో భయం, పిరికితనం 'ఇది' అని చెప్పటానికి కూడా వీలుకాని బలహీనత నన్ను ఆవహించి అన్ని విషయాల లోనూ వెనుకకు నెట్టేది. అదే బలహీనత తిరిగి నీవు నన్ను ప్రేమించానని చెప్పిన రోజు నుండి నాలో అలజడి లేవదీసింది. నన్ను నిద్రాహారాలకు కూడా దూరం చేసింది.

నిన్ను ప్రేమించాలని, నిన్ను వివాహం చేసుకోవాలని ఉండేది. నీ అనురాగం, నీ మనస్సు నన్ను ఆకర్షించాయి. కాని, ఏం చెయ్యను. నాలోని ఈ బలహీనతను, పిరికితనాన్ని ఎట్లా దూరం చేసుకోను ? వెనుకకు తిరిగితే చాలు, 'రాధ కూడా ఒక స్త్రీయే' అంటుంది నా అంతరాత్మ. నా మనస్సే నన్ను వంచిస్తూంది. ఈ బాధకు తట్టుకోలేక నిన్న నీకు ఏవో కథలు కల్పించి చెప్పాను. ఆ కథలు విన్నైనా స్త్రీ సహజమైన ఈర్ష్యతో నీవు నాకు దూరం అవుతావని ఊహించాను. మార్గరెట్, సునంద నా పిరికితనానికి, బలహీనతకు మారుపేర్లు. కాని, నా ఊహ సరియైనది కాదని తేలింది. నీలో కొంచెమయినా మార్పు లేదు. సరికదా ఏది ఏమైనప్పటికి నీవు నా ప్రేమను కాంక్షించావు. ఇది నా అంతరాత్మకు పరాజయంగా తోచింది. అప్పటినుండి నా మనస్సులో ఏవో అనుమానాలు, నా జీవితంపై నాకే అసహ్యం కలిగేలా ఉద్భవించటం మొదలుపెట్టాయి. నిన్న రాత్రంతా ఆలోచించాను. నేను ఒక నిర్ణయానికి కూడా రాలేకపోయాను. నాలోని పిరికితనాన్ని, బలహీనతను ఎదుర్కోలేకపోయాను. నిన్ను పొందలేననే ఒక విధమైన అనుమానం, ఒకవేళ పొందినా, సుఖ సంతోషాలతో జీవించలేమనే భయం — ఇట్లా పరిపరి విధాల మనస్సు కలతచెందింది. ఇక ఈ అనుమానాలతో నిన్ను వివాహం చేసుకుని మాత్రం నేను ఏమి సుఖపెట్టగలను ? అందుకే ఈ నిర్ణయానికి వచ్చాను. నీవు ఎల్లాగూ నన్ను విడిచి పెట్టవు. నీలోని ప్రేమానురాగాలు కట్టలులేని నది లాంటివి. ఈ పిరికి, వాడు నిన్ను పొందటానికి తగడు. అందుచేత నేను మనస్ఫూర్తిగా ప్రార్థిస్తాను నన్ను మరిచిపొమ్మని. ఇది సాధ్యం కాదంటావ్! కాని, ప్రయత్నించు. వేరొకరిని వివాహం చేసుకుని సుఖపడు.

నేనా? ఇక ఈ పిరికితనానికి, బలహీనతకు ఈ ప్రపంచానికే దూరంగా వెళ్ళిపోతున్నాను. రేపు ఈపాటికి హుస్సేన్ సాగర్‌లో నన్ను చూడగలవు. ఆఖరుగా ఒక్కసారి నీ కన్నీళ్ళతో నన్ను పావనం చెయ్యి. నా పాపాలను కడిగెయ్యి. అంతే. ఈ జీవితానికి ఈ సుఖం చాలు.

ఉరిశిక్ష అమలుజరిపే ముందు నిందితుడిని కోర్టువారు ఆఖరిసారిగా ఏదైనా కోర్కె ఉంటే అడగమంటారట. అట్లాగే నా ఈ తుది కోర్కెగా ఒక్కసారి మనసారా, 'రాధా' అని పిలవనిస్తావని ఆశిస్తాను. 'రాధా!' అని పిలుస్తానే!

రాధా ! నా హృదయమా ! . . . . ఇక సెలవు.

ఇట్లు పిరికివాడు భాస్కర్."

ఉత్తరం పొంతం చదివి ఒక్క నిట్టూర్పు విడిచాడు మూర్తి. అంతలో కర్తవ్యం గుర్తుకు వచ్చి, రాధను తీసుకుని వెంటనే కిందకు వచ్చాడు నౌబత్ పహాడ్ మీద నుండి. ఒక టాక్సీని పిలిచి రాధను ఎక్కమన్నాడు. తను కూడా కూర్చుని, టాంక్ బండ్ (హుస్సేన్ సాగర్) కు పోనిమ్మన్నాడు. టాక్సీ పది నిమిషాలలో టాంక్ బండ్ మధ్యకు వచ్చింది. ఈ పది నిమిషాలు, పది యుగాలుగా తోచాయి మూర్తికి. 'అబ్బ! ఎంత నెమ్మదిగా పోయాడు టాక్సీ!' అనుకున్నాడు.

రాధైతే ముళ్లపై కూర్చున్నట్టుంది. ఆమె కళ్ళు ఏడ్చి ఏడ్చి ఎర్రబారిపోయాయి.



ఈతరాని ఈత

చిత్రం-మానేపల్లి సత్యనారాయణ (విజయనగరం.1)

టాక్సీ ఉమన్స్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ టీషాపు దగ్గరకు వచ్చేసరికి అక్కడ చాలామంది జనం గుమిగూడి ఉన్నారు. మూర్తి టాక్సీ ఆపమని, ఒకరిని పిలిచి అడిగాడు ఏమిటి విశేషమని.

"ఆ! ఎవరో! నీళ్లలో దూకబోతూంటే చూచినవాళ్ళు పట్టుకున్నారు. పోలీసు స్టేషనుకు తీసుకుని వెళతారట" అన్నాడు అతను.

అంతే. మూర్తి టాక్సీలోంచి ఒక్క దూకు దూకి, జనాన్ని తప్పించుకుని మధ్యకు వచ్చాడు. ముఖం చేతులలో దాచుకుని ఏడుస్తున్నాడు భాస్కర్. వెనకనే వచ్చిన రాధ ఈ పరిస్థితి చూచి దుఃఖాన్ని ఆపుకోలేక పోయింది.

"భాస్కర్!" ఒక్క కేక పెట్టాడు మూర్తి ఆవేశంతో. రాధ, భాస్కర్‌దగ్గరకు వచ్చి అతని ముఖం తన రెండు చేతులతో పైకి ఎత్తింది. రాధను చూచి మరీ ఏడవటం మొదలుపెట్టాడు భాస్కర్ చంటిపిల్లాడిలా.

"పదు, భాస్కర్! టాక్సీలో కూర్చో! తక్కిన విషయాలు ఇంటి దగ్గర మాట్లాడుకుందాం!" అన్నాడు మూర్తి.

భాస్కర్‌ను కూడా తీసుకువచ్చి టాక్సీలో కూర్చోబెట్టాడు. రాధ కూడావచ్చి కూర్చుంది. జనం వింతగా చూస్తూండగా టాక్సీ బయలుదేరింది జనాన్ని తప్పించుకుని.

"ఈ పిరికివాణ్ణి క్షమించావను, రాధా!" అంటూ బావురుమన్నాడు భాస్కర్.

"అదేమిటండీ, భాస్కర్! అల్లా బాధపడతారు! మీ తప్పేముంది? దీనిలో నేనూ ఒక స్త్రీని కనుక అనుమానపడ్డారు. అంతేకదా? ఇప్పుడు అనుమానం తీరిపోయిందిగా? ఇంక ఏమీ అభ్యంతరం లేదుగా?" అంటూ అతనిని తన హృదయానికి హత్తుకుంది భాస్కర్ కళ్లలోని నీళ్ళు తుడుస్తూ. చంటిపిల్లాడిలా ఆమెకు హత్తుకుపోయాడు భాస్కర్. అతని నుదుటిపై వెచ్చని కన్నీరు జారి పడింది. పైకి చూచాడు. అవి రాధ కన్నీళ్ళు — కాదు, ఆనందబాష్పాలు.

"అనురాగం ఒక నది లాంటిది. అది పల్లానికే ప్రవహిస్తుంది." ★